



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం। 25 జూలై 2025

పేజీలు 8


# శ్రీశైలంలో నేటి నుంచి శ్రావణమాసోత్సవాలు ప్రారంభం



మహా పుణ్యక్షేత్రం శ్రీశైల ఆలయం

- భక్తుల రద్దీ రోజుల్లో గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల
- నిర్దిష్ట వేళలో స్పర్శదర్శనాలు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగం,అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలం మహాక్షేత్రంలో నేటి శుక్రవారం నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులకు వసతి, మంచి నీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, సాధారణ రోజులలో శ్రీస్వామిఅమ్మవార్ల ఆర్జితసేవలు, అన్న ప్రసాదాల వితరణ, పారిశుద్ధ్యం,వాహనాల పార్కింగు మొదలైన వాటికి సంబంధించి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. అన్ని

మిగతా 2లో




# శ్రీశైలంలో నేటి నుంచి శ్రావణమాసోత్సవాలు ప్రారంభం

(మొదటి పేజి తరువాయి)

విభాగాల అధికారులకు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. ఈ మేరకు ఈవో ఎం శ్రీనివాసరావు ఆయా ఏర్పాట్లపై తగు చర్యలు చేపట్టారు.

**రద్దీరోజులలో ఆర్జిత అభిషేకాలు నిలుపుదల :** భక్తుల రద్దీ కారణంగా శ్రావణ శనివారాలు,శ్రావణ ఆదివా రాలు, శ్రావణ సోమవారాలు, వరలక్ష్మీవ్రతం,శ్రావణపౌర్ణమి మొదలైన రోజులలో ( మొత్తం 16 రోజులపాటు)గర్భాలయ అభిషేకాలు,సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల

**నిర్దిష్టవేళలలో స్పర్శదర్శనాలు :** శ్రావణమాసం రద్దీ రోజులలో రోజుకు మూడు పర్యాయాలు స్పర్శదర్శనం కల్పించబడుతుంది.ఈ స్పర్శ దర్శన టికెట్లను ప్రస్తుతం అమలులో ఉన్నట్లుగానే దేవస్థానం వెబ్ సైట్ www.srisailadevasthanam.org ద్వారా ఆయా టికెట్లను ముందస్తుగా పొందవచ్చు.అదేవిధంగా ఆగస్టు 15 నుంచి 18 వరకు స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేయబడుతుంది.ఈ రోజులలో పూర్తిగా అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుంది.సర్వదర్శనం భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు నిర్దిష్ట వేళలో మాత్రమే ఈ స్పర్శదర్శనం కల్పించడుతోంది.మిగతా సాధారణ రోజులలో గర్భాలయ ఆర్జిత అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, కుంకుమార్చనలు యథావిధిగా కొనసాగుతాయి.భక్తులు వివిధ ఆర్జితసేవాటికెట్లను ఆన్లైన్ ద్వారానే పొందవలసివుంటుంది.

**ఆలయ పూజా వేళల్లో :** ప్రస్తుతం అమలులో ఉన్న విధంగానే ప్రతీ రోజు వేకువజామున 3 గంటలకే ఆలయద్వారాలు తెరచి మంగళ వాయిద్యాలు, సుప్రభాతసేవ,ప్రాతఃకాల పూజలు జరిపించబడుతాయి.ఉభయదేవాలయాలలో 4.30 గంటల నుంచి మహామంగళ హారతులు ప్రారంభించబడుతాయి.మహా మంగళ హారతుల ప్రారంభం నుంచే అనగా 4.30 గంటలకు భక్తులను దర్శనాలకు అనుమతించడం జరగుతుంది.సాయంత్రం 4 గంటల వరకు సర్వదర్శనంకొనసాగించబడుతుంది.తిరిగి సాయంకాలం4 గంటల నుంచి ఆలయశుద్ధి కార్యక్రమం నిర్వహించి మంగళ వాయిద్యాలు, ప్రదోషకాలపూజలు,సుసాంధ్యం తరువాత 5.30 గంటల నుంచి మహామంగళహారతులు ప్రారంభించబడుతాయి.మహామంగళ హారతుల ప్రారంభం నుంచే అనగా సాయంకాలం 5.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయి.

**ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతములు :**

శ్రావణమాసంలో భక్తుల సౌకర్యార్థమై రెండు పర్యాయములు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతములు జరిపించబడుతాయి.ఈ ఉచిత వరలక్ష్మీ వ్రతంలో ఒక్కొ క్క పర్యాయంలో 1600 మందికి అవకాశం కల్పించబడుతుంది. రెండవ పర్యాయం జరిగే ఉచిత వరలక్ష్మీవ్రతంలో ప్రత్యేకంగా 750 మంది చెంచు ముత్తైదవులకు అవకాశం కల్పించబడుతుంది. సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిపించుకునే భక్తులందరికీ ప్రసాదాలతో పాటు చీర మరియు రవిక వస్త్రం,గాజులు, పసుపు కుంకుమలు, కైలాసకంకణాలు, శ్రీశైలప్రభ మాసపత్రిక,వృక్షప్రసా దంగా దేవతా వృక్షం కూడా అందజేయబడుతాయి.వ్రతకర్తలకు శ్రీస్వామి అమ్మవార్ల దర్శనం కల్పించడంతో అన్నప్రసాదవితరణ భవనములో భోజన ప్రసాదం అందజేయ బడుతుంది.వ్రతకర్తలను అలంకార దర్శనమునకు మాత్రమే అనుమతించబడును.

# రైతులకు యూరియా కష్టాలు



లింగాపురంలో యూరియా కోసం ఎగబడ్డ రైతులు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు భూమి మందులు వేసుకునేందుకు రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. ఒక వైపు జోరుగా కురుస్తున్న వర్షాలు మరో వైపు మొక్కజొన్న పంటలు కలకలలాడుతున్నాయి. మండలంలో అత్యధికంగా వేల హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. దీంతో ఈ ఎరువులను వేసేందుకు యూరియా లేకపోవడంతో రైతులు యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం ప్రైవేట్ దుకాణాలకు ఇవ్వకుండా కేవలం రైతు భరోసా కేంద్రాలకే యూరియాను సరఫరా చేస్తుంది. దీంతో నాలుగైదు రోజుల నుంచి రైతు భరోసా కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. యూరియా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళనలో పడ్డారు. శుక్రమవాం కొత్తపల్లిలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు యూరియా సరఫరా చేయాలని నిరసన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజుల నుంచి యూరియా ఇవ్వడం లేదని వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగాపురం, నందికుంట గ్రామాల్లో యూరియా లోడ్ రావడంతో రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి అమిరున్నిసా బేగంను అడుగగా రైతు భరోసా కేంద్రాలకే యూరియా వస్తుందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఒక లోడ్ తరువాత మరొక లోడ్‌ను అందిస్తున్నట్లు తెలిపారు.



కొత్తపల్లిలో యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

## శ్రీ ధాత్రి ఇంగ్లీష మీడియం ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలో శ్రీ చైతన్య మేనేజ్‌మెంట్ వారి ఆధ్వర్యంలో నడపబడుతున్న శ్రీ ధాత్రి ఇంగ్లీష మీడియం పాఠశాల విద్యార్థులు ఎ.జి.ఎం సురేష్ , ఆర్.ఐ చౌదరి ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి సేవ్ ప్లాంట్స్, సేవ్ ప్లానేట్స్ అనే నినాదాలతో విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా సి.ఐ ప్రవీన్ కుమార్ ఎస్.ఐ దుగ్గిరెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం చెట్లు పెంపకం గురించి వాటి ప్రాముఖ్యత గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ గోవింద్ , ప్రిన్సిపల్ సుమలత, తస్లీం, డీన్ హరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యక్తిపై దాడి..కేసునమోదు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** కొలిమిగుండ్ల మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన దాసరి రామ్మోహన్ రెడ్డి మరియు వెంకటేశ్వర రెడ్డిలు ఇద్దరి మధ్య మనస్ఫర్థలు ఉండేవి. ఈ విషయంలో 23.07.2025న సాయంత్రం సమయంలో వెంకటేశ్వర రెడ్డి రామ్మోహన్ రెడ్డిని ముల్లు కట్టెతో కొట్టి రక్తగాయం చేసినట్లు మరియు వెంకటేశ్వర రెడ్డి అతని అనుచరులు నలుగురు కలిసి రామ్మోహన్ రెడ్డిని చంపుతామని బెదిరించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర రెడ్డి మరియు అతని అనుచరులుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ రమేష్ బాబు తెలిపారు.

# విద్యార్థులకు విద్యార్థి దశ కీలకం

**డోన్, మేజర్‌న్యూస్ః** రాబోయే కాలంలో పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకమని డోన్ రూరల్ సిఐ సిఎం.రాకేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నమల్కాపురం జడ్పిహెచ్ పాఠశాల యందు విద్యార్థులకు మత్తు పదార్థాలు, బాల్య వివాహాలు, సైబర్‌క్రైం వంటి అసాంఘీక కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సిఎం.రాకేష్ మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు మార్గం వైపు నడిచేందుకు ఎంతో ఆస్కారం ఉంటుందని, చెడు సావాసాలతో పక్కదారి పట్టి అసాంఘీక కార్యకలాపాలు చేసేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. చెడు వ్యసనాల ద్వారా కుటుంబంతో పాటు పాఠశాల, గురువులకు చెడ్డ పేరు వస్తుందన్నారు. కావున విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మంచి భవిష్యత్తు కొరకు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# పేద ప్రజల ప్రాణాలతో వైద్యాలు

ః- ధనంపై ఆశ..వైద్యంపై నిర్లక్ష్యం..
ః- తల్లి లేని పిల్లలను చేసిన ఎంఎస్ఆర్ ఆసుపత్రి
ః- ప్రాణం తీయడం..పైసలిచ్చి పంపడం..
ః- డాక్టర్లు కాదు కాని ఆసుపత్రి యాజమాన్యం
ః- నిద్రమత్తులో అధికార యంత్రాంగం
ః- ప్రాణానికి విలువ శూన్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్ ః** ప్రజలకు వైద్యం అందించే ఆసుపత్రులలో ప్రాణాలు తీసే వైద్యులు ఉన్నారు.. ప్రాణాలు పోసే వైద్యులు ఉన్నారు..ప్రాణాలు పోసి కొందరు వైద్యులు దేవుళ్లు అవుతారు..ప్రాణాలు తీసి కొందరు వైద్యులు రాక్షసులవుతారు. వైద్యులలో ఒకరి నిర్లక్ష్యం ఒక ప్రాణం పోయే అవకాశం ఉంది. ఇది వైద్యు లకు తెలిసి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజల ప్రాణాలపై శ్రద్ధ శూన్యం. వైద్యం పట్ల నిర్లక్ష్యం వహించే వైద్యులకు గుర్తింపు రద్దు చేసి వారిపై హత్య కేసు నమోదు చేయా లని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహజంగా అనారోగ్యంతో మరణిస్తే పర్వాలేదు రాత అంతేనని సరిపెట్టుకుంటాం. మెరుగైన వైద్యం కోసం డబ్బులు అప్పు తెచ్చి ప్రైవేటు ఆసుపత్రికి వస్తే వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజల ప్రాణాలు తీయడం పరిపాటిగా మారింది. తెలిసి తెలియక వైద్యం చేయడం వల్ల నిండు ప్రాణాలు బలైతే ఒక కుటుంబమే అంధకారంలోకి వెళుతుంది. ఈ నెల 18వ తేదీన శ్రీచక్ర ఆసుపత్రి నందు మహిళ మృతిచెందిన సంఘటన మరువక ముందే నగరంలోని చిరంజీవి పార్కు సమీ పంలో ఉన్న ఎంఎస్ ఆర్ ప్రైవేటు ఆసుప త్రిలో ఎమ్మిగనూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన మహాలక్ష్మి (35)అనే మహిళ మెరుగైన వైద్యం కోసం మంగళ వారం రాత్రి 9గంటల సమయంలో చేరింది. అయితే ఆసుపత్రి సిబ్బంది ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తామని కావాల్సిన పత్రాలను తీసుకుని అడ్మిట్ చేసుకున్నారు. బుధవారం వైద్యులు అందుబాటులోఉండి వైద్యంఅందిస్తారని నమ్మబలికారు. మహాలక్ష్మి ఆరోగ్య పరిస్థితి బాగోలేకనే కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో మంచి వైద్యం అందుతుందనే ఆశతో ఎంఎస్ఆర్ ఆసుపత్రిలో చేరామని బాధితులు తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు రోగానికి సంబంధించిన స్పెషలిస్టు వైద్యులు అదిగో వస్తున్నారు..ఇదిగో వస్తున్నారంటూ..నిర్లక్ష్యం వహించారు. గడియ గడియకు మహాలక్ష్మి పరిస్థితి విష మంగా మారుతూ వస్తుంది. కుటుంబ సభ్యులు ఆసు పత్రి సిబ్బందిని అనుక్షణం హెచ్చరిస్తూ గుర్తు చేస్తున్నా వైద్యులను సమయానికి పిలిపించకపోవడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. ఈ ఆసుపత్రి నందు ఆరోగ్యశ్రీ అంటూ రూ.35వేల వరకు ఖర్చు పెట్టించారని కానీ వాటికి బిల్లులు మాత్రం ఇవ్వ లేదని బాధితులు వాపో యారు. గురువారం ఉదయం నుండి పరిస్థితి విషమిం చడంతో ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించగా బాగానే ఉంది అంటూ మభ్య పెట్టారని, చివరకు బయట నుండి వచ్చిన వైద్యుడు చూసేసరికి మృతిచెందిందని నిర్ధారించినట్లు భర్త రాఘవేంద్ర తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులలో ప్రజల ప్రాణాలు పోతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నట్లు అమ్ముడు పోతున్నట్టా..లేక నిద్రపోతున్నట్టా.. వీటిలో ఏ నిజం. అలాకాదంటే ప్రైవేటు ఆసుపత్రులలో మరొక ప్రాణం పోకుండా నిర్లక్ష్యం వహించే వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యాలపై ఉన్నతాధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలి కదా. ప్రభుత్వ ఆసుపత్రి నందు వైద్యం నత్త నడకన అందుతుందని భయపడి ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయిస్తారు. ప్రభుత్వం ప్రైవేటు ఆసుప త్రులలో చికిత్స నిమిత్తం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మ కంగా ప్రవేశపెట్టింది. నగరంలోని ప్రైవేటు ఆసుపత్రు లను ఆశ్రయించి సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోయి సమస్యలను ఎదుర్కొని నిరాశతో వైద్యం కోసం వస్తున్న ప్రజలు వెనుదిరుగుతున్నారు. ప్రైవేటు ఆసుప త్రులలో ఆరోగ్యశ్రీని అడ్డుపెట్టుకుని ప్రజల సొమ్మును కొట్టేస్తున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు ధనంపై ఆశతో వైద్యంపై నిర్లక్ష్యం వహించి పేషెంట్ల ప్రాణాలతో చెలగా టమాడుతున్నారు. ఏదిఏమైనా మహాలక్ష్మి కుటుంబానికి జరిగిన అన్యాయం మరో కుటుంబానికి జరుగకుండ ఎంఎస్ఆర్ ఆసుపత్రిని సీజ్ చేసి వైద్యం సమయానికి అందించని డాక్టర్ల గుర్తింపును రద్దు చేయాలని బాధితులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న మృతురాలి భర్త రాఘవేంద్ర




ఎంఎస్ఆర్ ఆసుపత్రి

కర్ణాటకలోని ధర్మస్థలలో జరిగిన

# అత్యాచార, హత్యల పై నిష్పాక్షపాతంగా విచారణ జరపాలి



నిరసన చేస్తున్న డబ్ల్యుఐఎం నాయకురాలు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** కర్ణాటక లోని ధర్మస్థల ప్రాంతంలో వరుసగా మహిళలపై జరిగిన అత్యాచారాలు, హత్యల ఘటనలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని విమెన్ ఇండియా మూవ్మెంట్ ( డబ్ల్యుఐఎం) నంద్యాల శాఖ నాయకురాలు నయామునిస్సా డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల డబ్ల్యుఐఎం ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలతో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలిలో మహిళలపై జరిగిన సీరియల్ అత్యాచారాలు, హత్యలకు సంబంధించి అక్కడ పని చేసిన పారిశుధ్య కార్మికుడు ముందుకు వచ్చి ఇచ్చిన స్టేట్మెంట్‌పై వెంటనే సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 1995 నుంచి ఈ అత్యాచారాలు, హత్యలు జరిగాయని తెలిసి దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైందని, పోలీస్ వ్యవస్థ లోపాలపై సమగ్ర విచారణ చేయాలని అన్నారు. ఈ ఉదంతం బయటకు రాకుండా తొక్కిపెట్టిన వారిని శిక్షించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై జరిగే అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫహీం ముంతాజ్, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పీ-4 అర్హులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**దేవనకొండ మేజర్ న్యూస్ :** గ్రామాలలో ఉన్నటువంటి పి4 అర్హులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని యంపిడిఒ జ్యోతి అన్నారు.గురువారం మండల పరిదిలోని కుంకనూరు, పొట్లపాడు,కొత్తపేట గ్రామాలలో ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన పి4 అర్హులను గుర్తించేందుకు గ్రామ సభ ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా పొట్లపాడు గ్రామంలో సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభలో యంపిడిఒ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలిచేందుకు పి4 పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని కాబట్టి గ్రామంలో విధ్యుత్,గ్యాస్ మొబైల్,శుద్ధమైన నీరు,బ్యాంక్ ఖాతా లేని వారు అత్యంత పేదరికం కలిగిన


పారిశుధ్య కార్మికులకు జీతం పంపిణీ చేస్తున్న సర్పంచ్

వారిని అర్హులుగా పరిగణింపబడతారని కావున వారిని గుర్తించి వారి వివరాలను ప్రభుత్వానికి అందచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్,వివిఎ హరి నారాయణ తదితరుల పాల్గొన్నారు.

**పారిశుధ్య కార్మికులకు సొంత నిధులు పంపిణీ :** మండల పరిదిలోని పొట్లపాడు గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు గ్రామ సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి తన సొంత నిధులతో ఒక నెల జీతం పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గత ఏడు నెలలుగా జీతాలు అందలేదని కాబట్టి వారి కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉందని తెలియడంతో నా సొంత డబ్బును ఒక నెల జీతంగా అందించడం జరిగిందన్నారు.ఆదుకున్న గ్రామ సర్పంచ్ సోమశేఖర్ రెడ్డికి పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

## యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమత్తు పనులు

– కమీషనర్ విశ్వనాథ్


పైప్‌లైన్ మరమత్తు పనులు చేస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** సంతోష్ నగర్ జాతీయ రహదారిపై ప్రధాన తాగునీటి పైప్‌లైన్ లీకేజీ మరమత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు కమీషనర్ విశ్వనాథ్ వెల్లడించారు. గురువారం ఆయన మరమత్తు పనులను పరిశీలించారు. ప్రజలకు తాగునీటి సరఫరాను తిరిగి ప్రారంభించేందుకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక పైపునకు మరమత్తులు పూర్తయ్యాయని మరో పైపుకు మరమత్తు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

## ఆందోళన వద్దు త్వరలో మిగిలిన సొమ్ము జమ

**కర్నూలు, మేజర్‌న్యూస్ ః** తల్లికి వందనం పథకం గురించి ఆందోళన వద్దు..త్వరలోనే మిగిలిన సొమ్ము జమ..చేస్తామని ఐటిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు తిలక్ గట్టు అన్నారు. తల్లికి వందనంపై ఓ మీడియా ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నం చేస్తుండడంతో గురువారం సమావేశం నిర్వహించి దాని గురించి ఆయన వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనంలో ఎస్‌సి విద్యార్థులకు సంబంధించి కొంతవాటాను కేంద్రం భరిస్తుందన్నారు.

## అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి

– గడియారం ఆసుపత్రి వద్ద ఆక్రమణలు తొలగింపు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమీషనర్ పి విశ్వనాథ్ తెలిపారు. గురువారం ఆయన ఖడక్‌పుర, వడ్డేగేరి ప్రాంతాల్లో పర్యటించారు. మురుగునీరు సక్రమంగా ప్రవహించేందుకు, డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు తొలగించి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని కమీషనర్ ఆదేశించారు. అదేవిధంగా పాతబస్తిలోని గడియారం ఆసుపత్రి వద్ద రహదారిపై ఆక్రమణలను తొలగించినట్లు నగరపాలక సిఈ ప్లానర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. గడియారం ఆసుపత్రి వద్ద రహదారిని ఆక్రమించి వేసుకున్న 15 షాపులను గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, జిలాని, ముర్తుజావలి, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, బిల్డింగ్ సూపర్‌వైజర్ మధుగోపాల్, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


అక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

## బంగారు కుటుంబాల అర్హతను పునఃపరిశీలించాలి

– మార్గదర్శకులను త్వరితగతిన అన్వేషించాలి – కమీషనర్ విశ్వనాథ్



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పి4) పథకం కింద బంగారు కుటుంబాల అర్హతలను పునఃపరిశీలించాలని నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలో పి4 పథకం కింద 10,600బంగారు కుటుంబాలను గుర్తించామని ఈ నెలాఖరులోగా వారి అర్హతలను మరోమారు పక్కాగా పరిశీలించాలని సూచించారు. 629మంది మార్గదర్శకులను ఇప్పటికే ఎంపిక చేశామని వారికి 3,709మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అనుసంధానం చేశామన్నారు. మిగిలిన బంగారు కుటుంబాలను ఆగస్టు 15లోపు దత్తత తీసుకునేలా మార్గదర్శకులను అన్వేషించాలని తెలిపారు. సచివాలయంలో ఉన్న ప్రతి కార్యదర్శి ఈ ప్రక్రియను పూర్తిచేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆస్తి, కొళాయి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుంల వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, సూపరింటెండెంట్ మంజూరు బాబు, స్పెషల్ ఆఫీసర్ సొహైల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 27న జిల్లా యోగ సంఘం ఎన్నికలు



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నగరంలోని కృష్ణానగర్‌లో ఉన్న జిల్లా యోగా సంఘం హాల్ నందు ఈ నెల 27న జిల్లా యోగ సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం అధ్యక్షుడు డి లక్ష్మీకాంత్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా యోగా సంఘం గుర్తింపు పొందిన అనుబంధ సంస్థల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కొత్తగా ఎన్నికైన నూతన కమిటీ నాలుగు సంవత్సరాల పాటు కాలవ్యవధి ఉంటుందన్నారు.

## ప్రామాణిక నాణ్యతతో సర్వే చేయాలి



సర్వే యంత్రాంగంతో సమీక్ష చేస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో సర్వే అధికారులతో సర్వే భూమి రికార్డుల ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకటేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించుటకు భూ యజమానులకు రీ సర్వే ఒక మంచి పరిష్కార వేదిక అని తెలిఇపారు. కాబట్టి భూ యజమానుల సహాయ సహకారాలతో సర్వే బృందం అత్యంత ప్రామాణిక నాణ్యతతో సర్వే చేయాలని ప్రభుత్వం సెప్టెంబర్ 2027 లోపు రాష్ట్రమంతా భూముల రీసర్వే పూర్తి చేయాలని సంకల్పించింది. కావున గ్రామ సర్వేయర్లు ఆధునిక సర్వే సాంకేతిక పరికరాలతో సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఖచ్చితత్వంతో రికార్డులను తయారు చేయాలని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏదైనా సమస్య వచ్చిన వారికి అర్థమయ్యేటట్లు వివరించి చెప్పాలన్నారు. రైతుల దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ సర్వేయర్లు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేసి దిశా నిర్దేశం చేసి ఉన్నారు రీ సర్వే గ్రామాల రికార్డులను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈసమావేశంలో జిల్లా సర్వే భూమి రికార్డుల శాఖ అధికారి జయరాజు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## యువ పౌరుతకుల ఆర్థిక విజ్ఞానంపై అవగాహన సదస్సు


యువరాజ్‌శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో యువ పౌరులకు ఆర్థిక విజ్ఞానం ఒక మార్గదర్శక కార్యక్రమంపై విద్యార్థులకు అవగామన సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య వక్తగా రాజ్‌శే ఖర్‌రెడ్డి హాజరై సమాచారాన్ని అందించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతకు భవిష్యత్‌లో మ్యూచు వల్ ఫండ్లు ఎలా ఉపయోగపడతాయో విద్యార్థులకు వివరించారు. దేశ భవిష్యత్తును ముందుకు తీసుకుని వెళ్లాలో వివరించారు. స్టాక్ మార్కెటింగ్ వల్ల ఉన్న ఉపయోగాలు వాటిలో ఎలా అభివృద్ధి చెందాలి అనే విషయాలపై బోధించారు. మ్యూచువల్ ఫండ్లలో ఎలా తెలివిగా పెట్టుబడి పెట్టాలో యువత ఎటువంటి పెట్టుబడి ఆలోచనలతో వెళితే వారు దేశ అభివృద్ధి చెందుతుందో వివరించారు. ఈసదస్సు మూడు రోజుల పాటు నిర్వహించినందుకు రాజశేఖర్‌రెడ్డికి విద్యార్థులు, డైరెక్టర్ హేమంత్‌రెడగ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మంచి మనసులు

– తోటి ఉద్యోగి కుటుంబానికి చేయూత

– ఆర్థికసహాయం అందజేసిన ఫర్టిలైజర్ ఉద్యోగస్తులు


ఆర్థికసహాయం అందజేస్తున్న ఫర్టిలైజర్ ఉద్యోగస్తులు

**కోసిగి మేజర్ న్యూస్:** తమతోటి ఫర్టిలైజర్ ఉద్యోగంలో పనిచేసి మృతిచెందిన కుటుంబానికి తాము ఉన్నామంటూ చేయూతనందించి తమ మంచి మనసును చాటుకున్నారు. కోసిగిఇ తుంగభద్ర, మాధవరంకు చెందిన ప్రసిద్ధ బయోటెక్ కంపెనీలో సేల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ముక్తర్ అనే ఉద్యోగి చనిపోవడం జరిగింది. దీనితో ఆ కుటుంబం దీనస్థితిలో ఉండడంతో ఫర్టిలైజర్స్ ఉద్యోగస్తులు అందరు కలిసి ఒకరికొకరు చేయి కలిపి ముక్తర్ కుటుంబానికి కొద్దివరకు అండగా నిలిచారు. ఆయన ముక్తర్ అనే ఉద్యోగి చనిపోవడం చాలా బాధాకరమని అగ్రికల్చర్ యూనియన్ అధ్యక్షులు అన్నారు. దీనితో దాదాపుగా 42,100/-రూపాయలును ముక్తర్ భార్యకు అందజేయడం జరిగింది. చనిపోయిన ముక్తర్‌కు భార్య, కూతురు ఉండడంతో తమవంతు సహాయసహకారాలు అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగితే ఫర్టిలైజర్స్ ఉద్యోగస్తులంతా కలిసికట్టుగా ఉండి ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మూకిరెడ్డి, నాగరాజు, పురుషోత్తం, విజయ్‌కుమార్, హుసేని, షేక్షావలి పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com



# వైభవంగా శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి మహోత్సవం

**ప్రత్యేక అలంకరణలో అమ్మవారు**

**పూజల్లో పాల్గొన్న భక్తులు**





**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కల్లూరు నందు వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి మహోత్సవము శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కార్యనిర్వహణాధికాఇర వై గుర్రెడ్డి, గౌరవాధ్యక్షులు పోలిశెట్టి రాజ్ కుమార్,భజన బృందం ఆద్వర్యంలో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 6గంటలకు మహానీరాజనం, 7గంటలకు మహాభిషేకం, 8గంటలకు అలంకరణ, 9గంటలకు లక్షపుష్పార్చన, కుంకుమార్చన, 11గంటలకు మహానైవేద్యం, 11.45గంలకు మహానీరాజనం, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం 12.30గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 7గంటలకు శ్రీ చౌడేశ్వరి దేవి పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు భక్త బృందం సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# నేత్రపర్వంగా చౌడేశ్వరీ దేవి జన్మదిన వేడుకలు





**ఓర్వకల్లు, మేజర్ న్యస్ :** మండల కేంద్రంలోని ఓర్వకల్లులో వెలసిన చౌడేశ్వరి దేవి దేవాలయంలో చౌడేశ్వరిదేవి జన్మదిన వేడుకలు గురువారం నేత్రపర్వంగా జరిగాయి. ఆషాడ మాసలో అమావాస్య రోజు అమ్మవారి జయంతి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహిస్తారు. గురువారం అమావాస్య కావడంతో ఉదయం నుంచే అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి గుడికి తరలివచ్చి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ పెద్దల సహకారంతో సామూహిక కుంకుమార్చన చేశారు. చెన్నకేశవ భజన మండలి వారిచే భక్తిగీతాలు, భజన కార్యక్రమం చేపట్టారు. దాతల సహకారంతో భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తోట వీర క్షత్రియ సంఘం వారు తదితరులు పాల్గొన్నారు.

# నొస్సంలో వర్షం కోసం పూజలు



**అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న దృశ్యం**

**సంజామలమేజర్,న్యూస్ :** సంజామల మండలం నొస్సం గ్రామంలో సుంకులమ్మ అమ్మవారికి వర్షం రావాలని గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామ కళకళాడాలని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సుంకులమ్మ వారికి అధిక సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

# ఆధ్యాత్మికంలో.. శ్రావణానందం

శ్రావణమాసం అంటేనే ఆద్యాత్మికం శోభిల్లుతుంది.. భక్తి పారవస్యానికి విశిష్ఠ పండుగలు.. ఉపావాస దీక్షలు.. వ్రతాలు.. గురుదేవుల ఆరాదనోత్సవాలు.. నాగులచవితి వేడుకలు.. కృష్ణాష్టమి ఉట్టికొట్టు పందాలు.. జాతీయ పండుగలు.. అన్నా చెల్లెల్ల అనుబందానికి ప్రతీకగా రాఖీ పండుగ.. ఇలా శ్రావణమాసం అంతా ఆద్యాత్మిక ఆనందమే ..

- భక్తీ భావనతో విశిష్ఠ పండుగలు
- జిల్లా పశ్చిమ ప్రాంతంలో గురువుల ఉత్సవాలు
- జాతీయ దినోత్సవాలు .. అన్న చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక









**ఆనందం..** సంవత్సరంలో 12 మాసాలు ఉంటే ఒక శ్రావణమాసంకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.. మాసం ఆరంభం అయిన నాలుగవరోజు, ఐదవరోజు నాగులచవితి, నాగపంచమి వేడుకలు మహిళలు, కొత్త పెళ్లి జంటలు పాము పుట్టలకు పూజలు చేసి పాలు పోసే పండుగ అంటూ ఆరంభం అయిన ఆద్యత్మిక శోభ, వరాలు అందించే వరలక్ష్మి వ్రతం ఇంటి ఇల్లాలు ఆడపడుచులు కలుసుకు విశిష్ట పూజలు చేపట్టి వాయినాలు అందించుకుని ఆనందంగా గడుపుతారు. ఇదే నెలలో పౌర్ణమి పర్వదినాన అన్నా చెల్లెల్ల అనుబందానికి అవదులు లేకుండా పోయే రక్షాబందన్ ఎంతో ఆనందాన్ని పంచిపెట్టి కుటుంబాల కలయికకు చిరునామాగా మారుతుంది.. చెల్లెలు రాఖీ కడితే అన్న తమ్ముళ్లు కానుకలు అందించి మిఠాయిలు పంచకునే ఆనందం ఎక్కడ దోరుకుంది శ్రావణ పౌర్ణమి పర్వదినాన కాక.. ఇక శ్రీ కృష్ణ పరమాత్ముని జననం శ్రావణ మాసంలో అష్టమి దినాన జరుపుకుంటారు ఆరోజు చిన్నారులకు కృష్ణుని వేశాదారణలు, ఉట్టి కొట్టడాలు.. వెన్నముద్ద అంది ంచడం లాంటి అహల్లాద కరంగా కృష్ణాష్టమి జరుపుకుంటారు.. ఇలా పండుగలతో భక్తి బావం కలుగగా.. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో సద్గురువు దేవతలుగా బాసిల్లుతున్న మంత్రాలయం గురు రాఘవేంద్ర స్వాముల 354వ సప్త రాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకుం టారు గురరాయలు ఉత్సవాలకు దేశం నలుమూలల నుండి భక్తు తరలివచ్చి ఏడురోజుల ఉత్సవాలను భక్తి శ్రద్దలతో తిలకిస్తారు. ఇక కౌతాళం మండలం ఉరుకుందలో వెలసిన ఈరన్నస్వామి వార్లుకు 4 సోమవారాలు, నాలుగు గురువారాలు భక్తులు మొక్కులు తీర్చుకుం టారు. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా గురువులు శ్రీ ఉరుకుందు ఈరన్న సన్నిదానం ఎంతో ప్రసిద్ది చెందినది . శ్రావణమాసం ఉత్సవాలకు గురురాయలు సన్నిదానాలు ముస్తాబు అయ్యాయి.. ఇక జాతీయ దినోత్సవాలు ఆఘుష్టు 14 దేశ స్వాతంత్ర సిద్దించి 79 ఏళ్ల గడిచిన వేడుకలు జరుపుకుంటారు.. ఇక ఆఘుష్టు 19వ తే దిన ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సం కూడా ఎంతో అహల్లాదంగా జరుపుకుంటారు. ఇలా జూలై 25 తేదిన మోదలైన శ్రావణానందం ఆఘుస్టు 23 తేది వరకు భక్తి భావనతో ముందుకు నడుపుతుంది.. ఈ మాసంలో భక్తితో ముక్తి అందుతుందనే నమ్మకంలో మాంసాహారాలు, మద్యపానానికి జనం దూరంగా ఉండటం విశేషం ..

ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి

# అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించాలి



ఏపీ సచివాలయం నుంచి సీఎస్ విజయానంద్ కలెక్టర్లతో మాట్లాడుతున్న దృశ్యం



**సీఎస్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్**


**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**గ్రామసభల ద్వారా మార్గదర్శిలతో పాటు ఇంకా అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించి పేదరికం నుంచి బంగారు కుటుంబాలు అభివృద్ధి చెందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. ఏపీ సచివాలయం నుంచి సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం స్వర్ణ ఆంధ్ర పి-4 ఫౌండేషన్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజంట్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, ఆర్‌టిజిఎస్ లెన్స్‌పై సూచనలు, నగర గ్యాస్ సరఫరాకు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్ధేశం చేశారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలె క్టర్ మాట్లాడుతూ పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ మోడల్ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో గ్రామ సభల ద్వారా మార్గదర్శి మరియు బంగారు కుటుంబాలను గుర్తించే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలలో అవసరాలను గుర్తించేందుకు సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. పేదరికంతో దిగువన ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబంగా భావిస్త వారికి చేయూతనిచ్చే మార్గదర్శులను గుర్తించే ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మండలంలో తహశీల్దార్, ఎంపీడీఓలు అవగాహన పెంచుకుని ఆ మేరకు ప్రగతి సాధనకు కృషి చేయాలి. జిల్లాకు సంబంధించి ప్రగతి డేటాలో ప్రభుత్వం నిర్దేశించిన డాక్యుమెంట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# గంజహళ్లి పొలాలలో చిరుత సంచారం

**- ఎన్నెకండ్లలో దున్నపోతు పై దాడి చేసి చంపివేసిన చిరుత**



**చిరుత దాడి లో మృతి చెందిన దున్నపోతు**



**గంజహళ్లి శివార్లలో చిరుత సంచరించిన కాలి గుర్తులు**

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** గోనెగండ్ల మండల పరిధిలోని ఎన్నెకండ్ల, గంజహళ్లి, బెల్లందొడ్డి గ్రామా శివార్లలో గత మూడు రోజులుగా చిరుత సంచారం చేస్తుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు తీవ్రభయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఎన్నెకండ్ల గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర తన పంట పొలంలోని గుడిసె దగ్గర దున్నపోతును కట్ట వేసి ఉంచాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా దున్నపోతు లేక పోవడతో ఆ ప్రాంతంలోని కొండ ప్రాంతాలను, నాగేంద్ర, పశువుల కాపరులు వెదకగా గుండ్ల మద్యంలో చిరుత దాడిలో చచ్చి పడి ఉన్న దున్నపోతుకళేభరాన్ని చూశారు. మేత్తటి మాంసంను తిని మృత దేహంను అక్కడే వదిలి వెళ్లింది. ఆ ప్రాంతంలో చిరుత జాడ (అడుగులు) లు కనిపించాయి. అలాగే మరుసటి గురువారం తెల్లవారుజామున కూడా చిరుత దున్నపోతు చచ్చి పడి ఉన్న ప్రాంతానికి వచ్చినట్లు చిరుత జాడలను పరిశీలించి పశువుల కాపరులు తెలుపుతున్నారు. ఆ ప్రాంత పరిసరాలకు వెళ్లేందకు పశువులు కాప రులు, పంటపొలాల రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరుత ఎన్నెకండ్ల, గంజహళ్లి, బెల్లం దొడ్డి గ్రామాల పంట పొలాలో తిరుగుతున్నట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. గురువారం సాయంత్రం గంజహళ్లి గ్రామ శివార్లులో చిరుత కనిపించడంతో గ్రామస్థులు గుంపులు గా కేకలు వేస్తు కట్టేలతో వెళ్లడంతో చిరుత చెట్ల పొదలలోకి వెళ్లినట్లు గంజహళ్లి గ్రామస్థులు గ్రామ సర్పంచ్ రాముడు, గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. రాత్రి పూట పొద్దుపోయాక పొలాల దగ్గర ఉండేందుకు రైతులు భయపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చిరుతను బందించి అటవీ ప్రాంతంలో వదలాలని గ్రామస్థులు సంబందిత అధికారులను కోరుతున్నారు.

# పిఎంఎజివై నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించండి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పిఎంఏజివై) పథకం మంజూరయ్యే నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కర్నూలు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పిఎంఎజివై పథకం అమలుపై సంబంధిత అధికారులతో కన్వర్జెన్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఎజివై పథకం కింద దళిత జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయడం లక్ష్యమన్నారు. మొదటి విడతలో ఈ పథకం ద్వారా 3గ్రామాలు ఎంపిక చేసి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఓర్వకల్లు మండలంలోని బొడ్డువానిపల్లె గ్రామం, ఆదోని మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ, చాగి గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని ఎనిగబాల గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, పనులు పూర్తి చేసిన వాటికి రెండురోజుల్లోపు యుటిలైజేషన్ సర్టిఫికేట్‌ను సమర్పించాలని కలెక్టర్ సాంఘీక సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద ఫేజ్–2లో 9గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని, ఈ గ్రామాల్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా పథకానికి సంబంధించి గ్యాప్ ఉన్నట్లయితే పిఎంఎజివై నిధులు వినియోగించుకుని ఆ గ్యాప్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఐసిడిఎస్ పిడి నిర్మల, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ ఉమాపతి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉరుకుందస్వామి భక్తులకు తప్పని తిప్పలు

- ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కుపోయిన మంత్రాలయం తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి
- పట్టించుకోని పోలీసులు
- లబోదిబోమంటున్న భక్తులు

**కోసిగి మేజర్ న్యూస్ :**
ప్రతినెల ఒక్కసారి అమావాస్య వస్తే వేలాదిగా భక్తులు ఉరుకుందలో వెలసిన ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వెళ్ళడం జరుగుతుంది. అలాగే ఈనెల గురువారం రోజున అమావాస్య రావడంతో వేలాదిగా భక్తులు స్కూటర్లపైన, కార్లు, ఆటోల్లో, బస్సుల్లో బయలుదేరి దారిలో ట్రాఫిక్ సమస్యతో భక్తులు నరకయాతన భరిస్తున్నారు. ప్రతినెల అమావాస్యరోజు ఈ ట్రాఫిక్ సమస్యతో చాలా ఇబ్బందులకు గురి అవుతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే శ్రావణమాసం మొదలు కావడంతో గురువారం తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కుటుంబ సమేతంగా ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకొని తిరిగి వెళ్ళే మార్గంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీనితో ట్రాఫిక్‌లో దాదాపుగా రెండుగంటలపాటు తెలుగుదేశం నాయ కులు రాఘవేంద్రరెడ్డి కుటుంబం ఇరుక్కుపో యింది. ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డితోపాటు గన్‌మాన్‌లు, అనుచరులు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషిచేశారు. జుమ్మలదిన్నె నుండి ఉరుకుంద వరకు ట్రాఫిక్‌జామ్‌పై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపో యాయి. ఈ ట్రాఫిక్ సమస్యను భక్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి తమ బాధను పోస్ట్ చేయడంతో కౌతాళం పోలీసులు స్పందించి సంఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు నానా కష్టాలు పడ్డారు. అమావాస్య రోజున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు పోలీసులు చేపట్టాలని ముఖ్యంగా జుమ్మలదిన్నె గ్రామం నుండి ఉరుకుంద వరకు ట్రాఫిక్‌పై కోసిగి పోలీసులు దృష్టిపెట్టాలని భక్తులు కోరుతున్నారు. అలాగే ట్రాఫిక్ సమస్య ఎప్పుడు తీరుతుందో తెలియని పరిస్థితి ఉందని మళ్ళీ శ్రావణమాసం పూజలు మొదలు కావడంతో కోసిగి నుండి ఉరుకుందకు వెళ్ళాలంటే భయమేస్తుందని భక్తులు వాపోయారు. చిన్నపిల్లలను, చంటి పిల్లలను తీసుకొని దేవుని దర్శనానికి వెళుతున్నామని దేవుని దర్శనం జరుగుతుందోలేదోగాని.. ఈ ట్రాఫిక్‌లోనే దేవుడు కనిపిస్తున్నాడని దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భక్తులు విన్నవించుకుంటున్నారు.



జుమ్మలదిన్నెలో నిలిచిపోయిన వాహనాలు



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన టిడిపి ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

# శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయం రూ.4.17 కోట్లు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాల హుండీల ఆదాయాన్ని గురు వారం లెక్కించారు.భక్తులు గత 27 రోజులలో సమర్పించిన కానుకల్లో రూ.4,17,61,215 నగదు రాబడితోపాటు 225 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం,11 కేజీల 550 గ్రా ముల వెండి ఆదాయంగా చేకూరుంది.అదేవిధంగా యుఎస్‌ఏ డాలర్లు 475,యూఏఈ దిర్హమ్స్ 70,ఓమన్ బైసా 1300 ,కెనడా డాలర్లు 155,ఆస్ట్రేలియా డాలర్లు 305,ఇంగ్లాండు ఫౌండ్స్ 40,సింగపూర్ డాలర్లు 2, న్యూజిలాండ్ డాలర్లు 50,స్కాట్లాండ్ ఫౌండ్స్ 5,ఈరోస్ 30,సౌదీరియాల్స్ 1,కత్తార్ రియాల్స్ 51,మలేషియా రింగిట్స్ 1,ఇథియోపియన్ బిర్ 200,శ్రీలంక డాలర్లు 220, నేపాల్ రూపాయలు 160 మొద లైన విదేశీ కరెన్సీ కూడా హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమములో దేవస్థా నం ఈవో శ్రీనివాసరావు,డిప్యూటీ ఈవో రమణమ్మ,అధికారు లు,సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో

# స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

**– పోటీ చేయని టిడిపి సభ్యులు**



ఆర్‌జివి కృష్ణ నామినేషన్లు అందచేస్తున్న వైసిపి కార్పొరేటర్లు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరపాలక సంస్థ స్థాయి సంఘం (స్టాండింగ్ కమిటీ) సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా మారింది. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఐదు మంది పదవీ కాలం ఈ నెలాఖరుకు ముగియనుండడంతో ఆగస్టు 1 నుండి కొత్త కమిటీ సభ్యులను తెదేపా, వైసిపి పార్టీల నాయకులు ఎన్నుకోవాల్సి ఉంది. అయితే కొత్త సభ్యుల ఎన్నికకు నామినేషన్ల గడువు చివరిరోజైన గురువారం వైసిపి పార్టీకి చెందిన ఐదు స్థానాలకు గాను 7మంది కార్పొరేటర్లు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేసి అదనపు కమీషనర్ ఆర్‌జీవి కృష్ణకు అందచేశారు. కాగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. అయితే టిడిపి సభ్యులు మాత్రం నామినేషన్లు వేసేందుకు కార్యాలయం వరకు వచ్చి నామినేషన్ పత్రాన్ని పూర్తి చేసి దాఖలు చేయకుండ పార్టీ ఆదేశాల మేరకు వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో వైసిపికి చెందిన సభ్యులు ఏక్రగీవంగా ఎన్నిక కానున్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు ఈ నారాయణరెడ్డి 28వ వార్డు, వై వెంకటేశ్వర్లు 34వ వార్డు, సిహెచ్ సాంబశివరావు 39వ వార్డు, కురుబ మునెమ్మ 43వ వార్డు, షేక్ అహ్మద్ 50వ వార్డు, దండు లక్ష్మీకాంతరెడ్డి 26వ వార్డు, పి షాషావలి 1వ వార్డులు నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, సీనియర్ అసిస్టెంట్ జిఎం శ్రీకాంత్, టిడిపి, వైసిపి కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇదిలా వుండగా వైసిపి కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికవడంతో వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి ఎస్‌వి కాంప్లెక్స్ వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# జిల్లా ఎస్పీ చేతులమీదుగా సిఐకు ప్రశంసా పత్రం

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం మంత్రాల యం సిఐ రామాంజులుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మాధవరం గ్రామానికి చెందిన ల చ్చుమన్రి కొప్పూరప్ప చనిపోవాలని నదీలోకి దూకాడు.సమాచారం అందుకున్న మంత్రాల యం సిఐ రాష్ట్ర నిర్వాహణ సిబ్బందిని అప్రమత్తం చేసి నదిలోకి దూకిన కొప్పూరప్ప ప్రాణాలను కాపాడారు. అంతేకాకుండా శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగ కుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా సేవ చేయడం వలన గుర్తించిన జిల్లా ఎస్పీ ప్రశంసపత్రం అందజేసినట్లు తెలిపారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సిఐ

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీఎస్టీ జాయింట్ కమిషనర్



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి జిల్లా జీఎస్టీ జాయింట్ కమిషనర్ నీరజ గురు వారం నంద్యాల కలెక్ట రేట్‌లోని చాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజకు మారిని కలిసి పూల మొక్కను అందజేశా రు. ఈసందర్భంగా జిల్లాలో అమలు ఏయాల్సిన జీఎస్టీకి సంబం దించి పలు అంశాలపై జాయింట్ కమిషనర్ కలెక్టర్‌తో చర్చించారు.

# పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుంది

**– మండల విద్యాధికారి వెంకటేష్ నాయక్**



ఉపాధ్యాయులను సన్మానించిన తోటి ఉపాధ్యాయులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదోన్నతులు మరింత బాధ్యతలను పెంచుతాయని మండల విద్యాధికారి వెంకటేష్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ అధ్యక్షతన పదోన్నతి, బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా మెట్టుపల్లి గ్రామంలో పనిచేసి ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీలలో పియస్‌హచ్‌ఎంగా పదోన్నతి పొంది, హోళగుంద మండలానికి బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయుడు చిన్నపరెడ్డికి మరియు బదిలీపై కొలిమిగుండ్ల మండలానికి వెళ్ళిన ప్రధానోపాధ్యాయుడు రవీంద్రగుప్తకు, డోన్ మండలానికి వెళ్ళిన ఉపాధ్యాయురాలు రమాదేవిలకు మెట్టుపల్లి పాఠశాల తరపున శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యా యులు వెంకట్‌నాయక్, హాజీమస్తాన్‌వలి, శివ, ఎంఆర్‌సి సిబ్బంది మద్దయ్య, రామాంజినేయులు, పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వహకురాలు రామాంజినమ్మ, స్కావెంజర్ లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

# దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ



దేవరగట్టులో ఇన్‌ఛార్జ్ వీరభద్రగౌడ,నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం ప్రసిద్ధ పుణ్య క్షేత్రం దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి దేవాలయంలో గురవారం శ్రావణమాసం అమావాస్య సందర్భంగా టీడీపీ తాలూకా ఇన్‌చార్జీ వీరభద్రగౌడ,తనయుడు యువ నాయకుడు గిరిమల్లేశ్‌గౌడ, నాయకు లు,కార్యకర్తలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు చేశారు.దేవాలయంలోశ్రావణమాసం పూజలను భక్తులు ఘనంగా ప్రారంభించారు.స్వామి వారికి ఆలయ అర్చకులు మనోహర్‌స్వామి ఉదయాన్నే రుద్రభిషేకం,బిల్వార్చన, పుష్పార్చాన, మహమంగళారతి పూజలను చేశారు.అమ్మ వారికి కుంకుమ,బండారు అర్చన పూజలను విశేషంగా చేశారు,స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించారు.భక్తులు మండలం నుండి కాకుండా కర్ణాటక ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి పూజలను చెయిం చారు.మోక్కుబడులి తీర్చుకున్నారు.ధైవదర్శనం చేసుకున్నారు.దేవాలయంలో భక్తుల సందిడి నెలకొంది. ఆదేవిధంగా స్థానిక శ్రీ సిద్దేశ్వరస్వామి,ఎల్లార్తి తాతల దర్గాలో కూడా అమావాస్య పూజలు విశేషంగా జరిగాయి,వచ్చిన భక్తులకు అన్నాధాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సూర్య www.suryaa.com
శుక్రవారం 25 జూలై 2025

## శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారికి పుట్టింటి సారె సమర్పణ



శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారు

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామ శివారులో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారికి గురువారం భక్తులు పుట్టింటి పట్టుచీర సారె సమర్పించారు. ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా చౌడమ్మ అమ్మవారికిఉదయాన్నేపంచామృతాభిషేకం నిర్వహించారు.అనంతరం భక్తులు తెచ్చిన పుష్పాలతో విశేష పుష్పాలంకరణ జరిపారు. అమ్మవారికి చీరే సారేలో భాగంగా పట్టుచీరెలతో పాటు రకరకాల స్వీట్లు, పండ్లు, నైవేద్యంగా సమర్పించారు.పడకండ్ల,ఆళ్లగడ్డ నుండేకాకుండా సుదూర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వహకులు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ గావించారు.

## పీ-4తో పేదలకు ఉజ్వలభవిష్యత్తు



**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామపంచాయతీ నందు నేడుపీ.4 గ్రామ సభ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గ్రామ ప్రత్యేక అధికారి తాహీర్ హుస్సేన్ (డిప్యూటీఎంపీడీవో) అన్నారు. గురువారం డిప్యూటీ ఎంపీడీవో తాహెర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పి ఫోర్ గ్రామసభనిర్వహించడం జరిగింది. గ్రామం నందు 76 మంది బంగారు కుటుంబా లను 04 మార్గదర్శిలు దత్తతకు తీసుకోవడం అయినది పీ నరసింహారెడ్డి.ఎన్ మహబూబ్ బాషా, సురేంద్రనాద్, పి ప్రసాద్ తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, మండల కోఆర్డినేటర్ రాజ్ కుమార్, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లక్ష్య సాకారంలో ఒక ముఖ్యమైన ముందడుగు

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం భారత్-యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడాన్ని టివిఎస్ మోటర్ కంపెనీ స్వాగతిస్తుందని భారత్-యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై టివిఎస్ మోటర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణు స్పందించారు.ఈ ప్రతిష్టాత్మక ఒప్పందం 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 60 బిలియన్ డాలర్ల నుండి 120 బిలియన్ డాలర్లకు చేరుస్తుందని భావిస్తున్నామన్నారు. ఇది ప్రధానమంత్రి వికసిత్ భారత్ లక్ష్య సాకారంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలువనుందని అన్నారు. టివిఎస్ మోటర్ కంపెనీకి సంబంధించి, ప్రతిష్టాత్మక బ్రిటిష్ బ్రాండ్‌ను వ్యూహాత్మకంగా కొనుగోలు చేసిన తర్వాత, యుకె లో నార్టన్ మోటర్‌సైకిల్స్ యొక్క కొత్త శ్రేణిని విడుదల చేయటానికి సిద్ధమవుతున్న సమయంలో ఈ ఒప్పందం కీలకంగా మారుతుందన్న ఆశభావం వ్యక్తం చేశారు. భారీ వేదికపై దేశం యొక్క ఆవిష్కరణ, ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అపారమైన అవకాశాలను సృష్టిస్తుందని టివిఎస్ మోటర్ విశ్వసిస్తుందన్నారు.

## హమాలీ దస్తగిరి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఛైర్మన్

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో హమాలీగా పనిచేస్తున్న కలుగొట్ల గ్రామానికి చెందిన పింజారి దస్తగిరి ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ మల్లయ్య ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. దసగిరి కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలుగట్ల గ్రామ కమిటీ అధ్యక్షులుఈడిగ కొండన్న, కురువబుడ్డ ఈరన్న ఉరుకుంద మోహన్ పాల్గొన్నారు.

## బ్రహ్మగుండేశ్వరస్వామి ఆలయంలో వర్షం కోసం భజన

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వెలసిన శ్రీకామేశ్వరీదేవి సహిత బ్రహ్మగుండేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ఎర్రచెరువు దగ్గరలోని మిట్టమీద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద గురువారం అమావాస్యను పురస్కరించుకొని శ్రీఆంజనేయస్వామికి శ్రీరామ భజన భక్త బృందం వారు శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వర్షం కోసం భజన కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ నిర్వహకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన వైయస్ఆర్‌సిపి నాయకులు కురువ ఎల్లస్వామి ప్రతినెల అమావాస్యకు ఒకసారి ఇక్కడికి వచ్చిన భక్తాదులందరికీ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కురువ ఎల్లస్వామి పేర్కొన్నారు. శ్రీరామ భజన భక్త బృందం వారు మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో పాటు, వర్షం సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

## చెట్లను రక్షించుకుందాం..మానవ మనుగడను కాపాడుకుందాం

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** చెట్లను రక్షించుకొని, మానవ మనుగడను కాపాడుకుందామని స్వూర్తి సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. గురువారం పట్టణ సమీపంలోని మహాత్మగాంధీ జ్యోతిరావ్‌బాపూలే గురుకుల బాలికల పాఠశాల యందు స్వూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ గైనకాలజిస్ట్ రమ్యశిల్ప, రాష్ట్ర వాల్మీకి సంఘం డైరెక్టర్ వలసల రామకృష్ణ, పాఠశాల సిబ్బంది, ముఖ్య అతిధులు, స్వూర్తి సేవా సమితి సభ్యులు మొక్కలు నాటారు. మొక్కలను పట్టణానికి చెందిన మెహతాజ్ షోరూం జహంగీర్ అందించడంతో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, స్వూర్తి సేవా సమితి సభ్యులు స్వూర్తి మధు, భాస్కర్, చంద్ర, మోహన్‌రెడ్డి, జహంగీర్, ఉపాధ్యాయుడు రంగనాథ్, రాజుయాదవ్, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ఊహించిన దానికంటే ఏడాదిలో ఎక్కువే చేశాం

**'సుపరిపాలనలో తొలి అడుగు' లో ఎమ్మెల్యే గిత్త జయసూర్య..**



**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అలగనూరు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు అనే కార్యక్రమానికి నంది కొట్కూర్ శాసనసభ్యులు గిత్త జయసూర్య పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ తెదేపా ప్రభుత్వంలో చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ తమ ప్రభుత్వం ఏడాదిలోనే అన్నీ చేశామని చెప్పడం లేదని, కానీ ఊహించిన దానికంటే ఎక్కువే చేశామని ఆయన అన్నారు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్-6తో పాటు మరికొన్ని ఎన్నికల హామీలు ఇచ్చామని, వీటి అమలుపై సమీక్ష చేసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ముందు పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై ఉంటుందన్నారు. దీనినే పొలికటికల్ గవర్నెన్స్ అంటారని, ఇది ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఆశలు చాలా ఉన్నాయన్నారు. ప్రజలు కూటమిపై పెట్టుకున్న ఆకాంక్షలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఎంత అభివృద్ధి జరుగుతుందో చేసి చూపిస్తున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం వల్ల రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులు వెళ్లిపోయారనివిమర్శించారు. రాష్ట్రంపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు 4 కీలక హామీలపై సంతకాలు చేశానని గుర్తు చేశారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికివందనం ఇస్తామన్న హామీని అమలు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సును కూడా ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామన్నారు.

## నిరాశతో వెనుదిరుగుతున్న రైతన్నలు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** రైతన్నలు తమ పంటపొలాలకు భీమా చెల్లించడానికి మండల వ్యవసాయశాఖ అధికారులు జూలై 1వ తేది నుండి కామన్‌సర్వీస్ సెంటర్‌లో ఖరీఫ్ 2025 క్రాప్ ఇన్సురెన్స్ పోర్టల్ లాగిన్ ఓపెన్ అయిందని మండలంలోని రైతులకు ఆయా రైతు సేవాకేంద్రాల ద్వారా తెలియజేశారు. దీంతో రైతు సోదరులు ఖరీఫ్ 2025 తమ పంట పొలాలకు మీ యొక్క ప్రాంతాన్ని బట్టి, వేరుశనగ, పత్తి, వరి, ఉల్లి, ఆముదం, జొన్నలు, కందులు, కొర్రలు, మొక్కజొన్నలు, మిరప, కొర్రలు తదితర పంటలకు క్రాప్ ఇన్సురెన్స్ చేయించుకోవాల్సిందిగా అధికారులు తెలిపారు. 2025 జూలై 1వ తేది నుండి జూలై 15వ తేది చివరి తేది అని కూడా ప్రకటించారు. తదనంతరం జూలై 21వ తేది వరకు పొడగించామని అధికారులు తెలిపినప్పటికీ రైతులు నెట్ సెంటర్ల దగ్గరకు ప్రధానమంత్రి ఫసల్‌భీమాను చెల్లించడానికి వెళితే అందుకు సంబంధించిన పోర్టల్ లాగిన్ ఓపెన్ కాకపోవడంతో రైతులు నిరాశతో వెనక్కి వెళ్తున్నారు. గత వైయస్ఆర్‌సిపి ప్రభుత్వంలో రైతుల పంటల భీమా ప్రభుత్వమే చెల్లించేదని, అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మాత్రం 2025 ఖరీఫ్‌లో రైతులకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కల్పించలేక పోయిందని రైతులు వాపోతున్నారు.

## శ్రీ చౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న బి.సి రాజారెడ్డి





అమ్మవారిని దర్శించుకుంటున్న దృశ్యం, రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బి.సి రాజారెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** ప్రముఖ శైవ క్షేత్రమైన నందవరం శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి జయంతి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి జయంతి ఉత్సవాలకు హాజరయ్యారు. ముందుగా ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ పి.వి కుమార్‌రెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, టీడీపీ యువ నాయకుడుపి.వి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బి.సి రాజారెడ్డికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం బి.సి రాజారెడ్డి చౌడేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ చక్రం వద్ద కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు బి.సి రాజారెడ్డి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. అనంతరం శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ పి.వి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కీ.శే. బి.సి గుర్రెడ్డి, బి.సి గుర్రెడ్డి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని బి.సి రాజారెడ్డి ప్రారంభించి రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బి.సి రాజారెడ్డి మాట్లాడుతూ యువత రక్తదాన శిబిరాల్లో తప్పక పాల్గొని రక్తదానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచి పలువురికి స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. రక్తదానం అంటే చాలా మందిలో ఎన్నో అపోహలు ఉన్నాయన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేయడం వల్ల ఎటువంటి నష్టం ఉండదన్నారు. రక్తదానం చేసిన వారిలో పాత రక్తం పోయి కొత్త రక్తం వస్తుందే తప్ప ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి గర్భిణీస్త్రీలు తదితరులు ఎంతో మందికి అత్యవసరం ఉంటుందని యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల వారు ప్రాణాలు కాపాడిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## రైతులు పంట నమోదు చేసుకోండి

**- విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు**



క్రాప్‌బుకింగ్‌లో పాల్గొన్న వి.ఎ.ఎ సుబ్బరాయుడు

**దొర్నిపాడు మేజర్,న్యూస్‌:** రైతులు కరీఫ్ సీజన్‌కు సంబంధించి తమ పొలంలో ఏఏ పంటలు సాగు చేశారో వాటిని రైతు సేవా కేంద్రం వద్దకు వచ్చి పంటలు నమోదు చేసుకోవాలని క్రిష్టిపాడు గ్రామ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు యొక్క పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు తీసుకొని పంట నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు. పంట నమోదు చేసుకోకపోతే రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు లభించవని కావున గ్రామంలోని ప్రతి ఒక రైతు తమ వివరాలను అందించి పంటల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలి

**కర్నూలు డివిజన్ ఉద్యానశాఖ**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** రాష్ట్ర ప్రభుత్వం 2025-2026 సంవత్సరానికి గాను అందించే ప్రభుత్వ సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలని కర్నూలు డివిజన్ ఉద్యానశాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా పండ్లు, పూలు, కూరగాయలు డ్రిప్‌ను ఉపయోగించి సాగుచేసే రైతులకు మామిడి, చీని, నిమ్మ, జామ, డ్రాగన్ ఫ్రూట్, అంజూర, దానిమ్మ, చింత, నేరేడు, సీతాఫలం, పనస, ఉసిరి, కొబ్బరి వంటి వాటితో పాటు బంది, ఛామంతి, మల్లె, గులాభి పంటలతో పాటు కూరగాయ పంటలకు డ్రిప్ వ్యవస్థను ఉపయోగించి, ఎత్తుమడులపై సాగు చేసిన హైబ్రీడ్ ఉల్లి పంటలకు సబ్సిడి ఇవ్వడం జరుగుతుందన్నారు. కృష్ణగిరి మరియు కర్నూలు మండలాలకు ఆయిల్‌పామ్ సాగు చేయదలచిన రైతులకు ఉచితంగా మొక్కలు ఇవ్వడం జరుగుతుందనీ కావున ఆసక్తిగల రైతులు సమీప రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కావున ఆసక్తి ఉన్న రైతులు వారికి సంబందించిన పత్రాలతో సమీప రైతుసేవా కేంద్రంలో ఉన్న విహెచ్ఎ, విఏఏ, ఎంపిఈఓలను సంప్రదించాలన్నారు. 1-బి పత్రం(ఒరిజినల్), ఆధార్‌కార్డు (జిరాక్స్), పట్టాదారు పాస్‌పుస్తకం(జిరాక్స్), బ్యాంక్ పాస్‌బుక్(జిరాక్స్), పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో ఒకటి, మొక్కలు విల్లు, రైతు సేవాకేంద్రం సిబ్బందితో దిగిన జిపిఎస్ ట్యాగ్ ఉన్న ఫీల్డ్ ఫోటోలను రైతులు అధికారులకు సమర్పించాలన్నారు.

# వర్షం కోసం శివుడికి వరుణ యాగం





**చాగలమర్రి,మేజర్ న్యూస్ :**మండల కేంద్రమైన చాగలమర్రిలోని చిన్న మఠానంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి అయిలంతో ఫర్టిలైజర్ మరియు పెస్టిసైడ్ విత్తన దుకాణాల ఆపోషి యేషన్ ఆధ్వర్యంలో పరమశివుడికి వరుణయాగం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు ఓరుగంటి కిషోర్ శర్మ, కొలిమడ ప్రసాద్ శర్మ, వారణని హేమంత్ శర్మ బృందం చే గణపతి పూజ,పుణ్యా హవాచనం, ప్రధాన కలశ స్థాపన, వరుణ పూజ, నవగ్రహ పూజ, లక్ష్మీనారాయణ స్వామి పూజ, లక్ష్మీ నరసింహస్వామిపూజ,మహన్యాసఏకాదశరుద్రాభిషేకం, గణపతి హెూమం, రుద్ర హెూమం, దుర్గా హెూమం, లక్ష్మీ నరసింహ స్వామి హెూమం, సుదర్శన హెూమం, లక్ష్మీనారాయణ స్వామి హెూమం, నవగ్రహ హెూమం, జాలాది హెూమం, పూర్ణాతి హెూమం, మహా మంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించి సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని మండల ప్రజల సుభిక్షంగా ఉండి అభివృద్ధి చెందాలని శివపార్వతులను వేడుకున్నారు. అనంతరం మండల పురుగు మందులు ఎరువులు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.ఆలయ కమిటీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, పురుగుమందులు ఎరువులఅసోసియేషన్ అధ్యక్షులుఆదవేణి రవికుమార్, ఉపాధ్యక్షులు చంద్రమౌళీశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శులు చల్లా నాగరాజు యాదవ్, ప్రసాద్ రెడ్డి, సభ్యులు దస్తగిరి, రాజశేఖర్, వీరయ్య, బ్రహ్మయ్య, గోపాలకృష్ణ లతోపాటు భక్తులు పాల్గొన్నారు.

**పార్వతీదేవికి శాకంబరీ అలంకరణ ..అసోసియేషన్ మహిళా మూర్తులు :** ఆషాడ మాసం సందర్భంగా వరుణ కటాక్షం కోసం చాగలమర్రిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ దేవికి ఆషాడ మాసం సందర్భంగా శాకంబరీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుగుమందులు ఎరువుల అసోసియేషన్ మహిళా మూర్తులు వర్షాలు విరివిగా పడి పంటలు సమృద్ధిగా పండాలని రైతులందరూ, రైతు కూలీలు సుఖ శాంతులతో విరజిల్లాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పురుగుమందుల ఎరువుల అసోసియేషన్ సభ్యులు సునీత, శిరీష, మాధవి, గురులక్ష్మి, నాగమణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

**సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తాం**
**సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే కెఈ.**



**తుగ్గలి,మేజర్ న్యూస్:** సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్ళు లాంటివని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే ఈ రెండు సాధ్యమని పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యామ్ కుమార్ అన్నారు.తొలి అడుగు సంవత్సర సుపరిపాలన కార్యక్రమం గురువారం తుగ్గలి మండలము రాతన గ్రామంలో ముగిసింది. ఈ సందర్భంగా పత్తికొండ శాసనసభ్యులు కేఈ.శ్యాంకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి తల్లికి వందనం, ఉచిత సిలిండర్, వృద్ధాప్య పింఛన్ తో పాటు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు తీరును తెలుసుకొని ప్రభుత్వ పాలనపై ప్రజలు తెలియజేస్తున్న స్పందన పై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం సాయశక్తులా కృషి చేస్తున్నాడని పేర్కొన్నారు. వెనుకబడిన నియోజకవర్గం చంద్రబాబుతో అభివృద్ధి సాధ్యమన్నారు. సంవత్సరంలోనే ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తూ వస్తున్నాడన్నారు. ముమ్ముందుకు మహిళల కు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు తదితర వాగ్దానాలను కూడా అమలు చేస్తాడని తెలియజేశారు.రాబోయే రోజుల్లోతెలుగు దేశం ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుని వ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, టీడీపీ రైతు సంఘము ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి, కృష్ణ మూర్తి చౌదరి, మైరాముడు, వెంకటేశ్వర చౌదరి,ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎప్పటికీ 'సోమప్ప సర్కిల్' పేరు మారదు

- **చేనేతల నుంచి ఎమ్మెల్యే బీవీని దూరం చేయాలనే కుట్ర**
- **చిచ్చుపెట్టడమే కోనేరు పనిగా పెట్టుకున్నారు**
- **పట్టణ సుందరీకరణలో భాగంగానే 100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు**
- **టీడీపీ నాయకులు వెల్లడి**
- **తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:**
ఎమ్మిగనూరు పట్టణ నడిబొడ్డున ఉన్న పద్మశ్రీ మాచాని సోమప్ప సర్కిల్ పేరు మారుస్తున్నారన్న అపోహలు, ప్రచారాలను ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దు. సోమప్ప సర్కిల్ పేరు ఎప్పటికీ మార్చే ప్రసక్తేలేదు అని టీడీపీ పట్టణ అధ్యక్షు లు మాచాని మహేష్, చేనేత టీడీపీ నాయకులు దామ నరసింహు లు, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ బండా నరసప్ప, భీమేష్, చేనేత నాయకులు బుగిడె నాగరాజు, మిన్నప్ప, కామర్తి మహేష్ లు స్పష్టం చేశారు. గురువారం టీడీపీ కార్యాలయంలో వారు విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ జెండాను ఏర్పాటు చేస్తే సోమప్ప సర్కిల్ పేరు పోతుందన్న కోనేరు నాగేంద్రప్రసాద్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టణ మధ్యన 100 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న ఆలోచన చేశారు. అయితే దాన్ని కోనేరు నాగేంద్ర ప్రసాద్ వక్రీకరిస్తూ, అవివేకంగా మాట్లాడటం సరి కాదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మున్సిపాలిటీ స్పెషల్ గ్రేడ్ కావడంతో పట్టణ సుందరీకరణలో భాగంగా అనేక మార్పులు, చేర్పులతో పట్టణాన్ని అందంగా ఆధునికరణించుకో వడం ఇది ఒక అభివృద్ధిలో భాగమని పేర్కొన్నారు. ఎన్ని తరాలు మారినా.. ఎన్నటికీ సోమప్ప సర్కిల్ పేరును మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అప్పట్లో ఎమ్మిగనూరు కోసిగి పంచాయతీ పరిధిలో ఉంటే దాన్ని రప్పించిన మాచాని సోమప్ప మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. వైడబ్ల్యూసీఎస్, టౌన్ బ్యాంకు, స్పిన్నింగ్ మిల్లు, వీవర్స్ కాలనీ వంటి వాటిని నెలకొల్పిన గొప్ప వ్యక్తి మాచాని సోమప్పను మర్చిపోవడం ఎవ్వరి తరం కాదన్నారు. దుబాయ్ లో కూడా ట్రాన్స్ పోర్ట్ నడిపిన వ్యక్తి సోమప్పకు పద్మశ్రీ అవార్డు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి చేనేతలలో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీవీకి, చేనేతల మధ్య దూరం చేయాలని కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. కోనేరు నాగేంద్ర ప్రసాద్ కులాల మధ్య చిచ్చు పెట్టడమే కాకుండా విభేదాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. టీడీపీ పార్టీకి చేనేతలను దూరం చేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసిన సాధ్యం కానీ పని అన్నారు. బీవీ కుటుంబం అంటే చేనేతలు, చేనేతలుఅంటే బీవీనే అన్నారు. చేనేతలకు ఎమ్మెల్యే బీవీ ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఎవ్వరూ నమ్మవద్దని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండాఏ పట్టణమైనా నడిబొడ్డునే పెడతారన్నారు. హైదరాబాదులో జాతీయ జెండాను గోల్కొండలో పెట్టినంత మాత్రాన గోల్కొండ ప్రాధాన్యత తగ్గిందా? అని ప్రశ్నించారు. ఎమ్మిగనూరుని అభివృద్ధి చేసింది ముమ్మాటికీ మాచాని సోమప్ప ఆ తరువాత బీవీ కుటుం బం మాత్రమేనని వారు గుర్తు చేశారు. జాతీయ జెండాను ఏర్పాటు చేసినంత మాత్రాన సోమప్ప సర్కిల్ పేరు కనుమరుగవ్వదు.. కేవలం కొందరు గిట్టనివాళ్ళు అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారి ప్రచారాలను ఎవ్వరూ నమ్మవద్దని టీడీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చేనేత నాయకులు ఈరన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ చేనేత నాయకులు

## సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పాములపాడు మేజర్ న్యూస్ :**సీఎం సహాయ నిధి చెక్కులను నందికొట్కూరు నియోజకవర్గ శాసనసభ్యుడు గిత్త జయసూర్య మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన ఇరువురి శ్రీనివాసులు 46,761, నందికొట్కూరులోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరంగాఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.లబ్ధిదారుడు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు మంజూరు చేసిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.నాయకులు, లక్ష్మీకాంతరెడ్డి మోహన్ గౌడ్ దానమయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రతినిధులతో సమావేశమైన ఆర్డీఓ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నంద్యాల ఆర్డిఓ విశ్వనాథ్ గురువారం తహసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధి లోగల పోలింగ్ కేంద్రాల మార్పులు, 1200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాల బైఫర్గేషన్ గురించి ఆయా పార్టీల ప్రతినిధులతో చర్చించారు. పార్టీల ప్రతినిధుల నుండి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి, ఇతర మండలాల తహసిల్దార్లు, టిడిపి తరఫున కౌన్సిలర్ హుస్సేన్ భాష, శీలం హరికు మార్ రెడ్డి, వైకాపా తరపున గంగుల రామిరెడ్డి, కూలూరు నరసింహారెడ్డి, గుబగుండం వెంకటసుబ్బారెడ్డి, కాంగ్రెస్ తరపున బి హుస్సేన్ బాషా, సిపిఎం తరపున నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

## ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు

**మిడుతూరు మేజర్ న్యూస్ :** తొగటవీర క్షత్రీయ కుల దేవతచౌడేశ్వరీదేవి అమ్మ వారి జయంతి ఉత్సవం గురువారం కన్నుల పండువగా సాగింది. ఉదయంనుండి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. హెూమాలు నిర్వహించారు.ఆదిపరాశక్తి, భద్రకాళి, చౌడేశ్వరీదేవి మహాహెూమం, మహాజయాధి హెూమం, మహాపూర్ణాహుతి, దేవాలయ మండప మహాబలి, మూలవిగ్రహపంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి బోనం కుండను దేవాలయంచుట్టూ తీసుకెళ్లాడు.అనంతరం తొగటవీరక్షత్రియ మహిళలు పెద్దఎత్తున మోసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.భక్తులకు తీర్థ ప్రసాదలను అందజేశారు మధ్యాహ్నం భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు కార్యక్రమంలో డీలర్ లక్ష్మీనారాయణ పాణ్యం శ్రీనివాసులు రంగస్వామి వెంకటేశ్వర్లు ఆటో ప్రసాద్ శ్రీనివాసులు జి శ్రీనివాసులు నన్నయ్య మోహన్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.





అలంకరణలో అమ్మవారు,బోనాలకుండను తీసుకెళ్తున్న కాతా రమేష్ రెడ్డి

## ఘనంగా చౌడేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు



**గడివేముల మేజర్ న్యూస్ :** గడివేముల మండలంలోని గని గ్రామంలో గురువారం నాడు చౌడేశ్వరి అమ్మవారి ఆలయం నందు ఆషాడ మాసం అమావాస్య సందర్భంగా అమ్మవారి జయంతి వేడుకల సందర్భంగా అమ్మవారికి పురోహితులుదేవి దీప్తి, అఖిల మరియు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని చీర,సారె, ఒడి బియ్యం సమర్పించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమన్ని ప్రతాపరెడ్డి మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు.గ్రామస్తులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పరుచూరి అశోక్ చౌదరి హత్య కేసులో నిందితులు అరెస్ట్

**పాణ్యం, మేజర్న్యూస్ :** మండలంలో ఈ నెల 20వ తేదీన పాణ్యం గోరుకల్లు రోడ్డు ముసుకు సుబ్బయ్య కూల్డ్రింక్ షాపులో జరిగిన పరుచూరి అశోక్ చౌదరి హత్య కేసులో నిందితులు పోలీసులు గురువారం అరెస్ట్ చేసినట్లు సిఐ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. హత్యకు ప్రధాన కారణం ఆర్థిక లావాదేవీలే అని అన్నారు. హంతకులు వాడిన ఆయుధాలను వారి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముసుకు సుబ్బయ్య, ముసుకు సురేష్, సల్కాపురం రమేష్, ఏనకండ్ల బాలకృష్ణ, మండ్ల మణికుమార్, అనుపూర్ మాబు హుస్సేన్తో పాటు మరో నలుగురు మైనర్లను అరెస్ట్ చేసి నిందితులను రిమాండ్కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ కిరణ్ కుమార్ రెడ్డి

## శ్రీశైలం డ్యాం రెండు గేట్ల నుంచి కొనసాగుతున్న

# నీటి విడుదల

- కుడి,ఎడమ గట్టు
- జల విద్యుత్ కేంద్రాల్లో
- ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది.దీంతో డ్యాం రెండు గేట్ల ద్వారా నాగార్జున సాగర్కు నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల,సుంకేసుల ప్రాజెక్టుల ద్వారా 1,01,785 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది.డ్యాం రెండు గేట్లు 55,406 క్యూసెక్కులు కుడి,ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 66,468 క్యూసెక్కులు మొత్తంగా 1,21,054 క్యూసెక్కులన్నిటిని నాగార్జునసాగర్ కు విడుదల చేశారు.కాగా జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కు 24,166 క్యూసెక్కులు,హెచ్ఎన్ఎస్ఎస్ 1,598 క్యూసెక్కులు,మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో నీరు పుష్కలంగా ఉండటంతో రెండు విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టారు.కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 31,508 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 16.648 మిలియన్ యూనిట్లు,భూగర్భ విద్యుత్ కేంద్రంలో 38,119 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 17.730 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 883.10 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 205.2258 టీఎంసీలుగా నమోదైంది.

# మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలి

- పోలీస్‌స్టేషన్లలో సాంకేతికతను వినియోగించుకోవాలి
- డ్రగ్స్‌కు గుడ్‌బై చెబుదాం..
- కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న డిఐజి కోయ ప్రవీణ్



హాజరైన డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలని, డ్రగ్స్‌కు గుడ్‌బై చెప్పాలని కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాత కర్నూలు రేంజ్‌లోని కర్నూలు జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. పోలీస్ అంటేనే భద్రత అనే విధంగా పోలీసులు పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో బాధితులకు న్యాయం జరిగితే పోలీస్ ఉన్నతాధికారులను బాధితులు ఆశ్రయించే అవకాశం ఉండదన్నారు. స్టేషన్లలో న్యాయం జరుగకపోతేనే పోలీసు ఉన్నతాధికారులను బాధితులు ఆశ్రయిస్తున్నారన్నారు. పాత కక్ష్యలు లేకుండా అందరికి కౌన్సిలింగ్ చేయాలన్నారు. ఎక్కడా అల్లర్లు జరుగకుండా ఓపెన్ డ్రింక్ లేకుండా డ్రోన్ కెమెరాలతో నిఘా, విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని పోలీసులు పెంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నేరాల కట్టడికి గట్టిగా కృషి చేయాలని స్టేషన్ల పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో నేర నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అవసరమైన చోట పిడి యాక్ట్‌లు, బైండోవర్‌లు, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీలు చేయాలని, నింధితుల వేలిముద్రలను సేకరించి చేధించాలన్నారు. కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రైల్‌కు వచ్చేలా కృషి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత 6నెలల కాలంలో నమోదైన క్రైం గణాంకాల విశ్లేషణ జరిపి పోలీస్ అధికారులు, సిబ్బంది యొక్క పనితీరు సంతృప్తిగా ఉందని ఇదే పనితీరును కొనసాగించాలన్నారు. జిల్లాలో గంజాయి వంటి మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈగల్ టీం ఆద్వర్యంలో డ్రగ్స్ గుడ్‌బై చెబుదాం..డ్రగ్స్ వద్దు బ్రో..మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయాలనే కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట రామయ్య, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత, ఏఆర్ డిఎస్పీ భాస్కర్‌రావు, సిఐలు, ఎస్ఐలు, ఈగల్ టీం, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో కావలసినంత

# యూరియా ఉంది

- యూరియా విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందొద్దు - జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో కావలసినంత యూరియా అందుబాటులో ఉందని, యూరియా విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య తెలిపారు. ఈ సందర్బంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాధారణ వర్షపాతం 401.1మి.మీలు కాగా గురువారం వరకు 141.3మి.మీల వర్షపాతం నమోదైందన్నారు. ఖరీఫ్-2025 పంటకాలం యొక్క సాధారణ విస్తీర్ణం 4,22,540 హెక్టార్లున్నాయి. జిల్లాలో పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, మినుము, ఉల్లి, మిరప మొదలైన ప్రధాన పంటలు సాగు చేస్తున్నారన్నారు. నేటివరకు జిల్లాలో 219875హెక్టార్ల విస్తీర్ణంలోపంటలు సాగు చేయడమైందన్నారు. జూలై 23నాటికి జిల్లాలో 1930మెట్రిక్ టన్నుల యూరియా లభ్యతలో ఉందన్నారు. రైతుసోదరులు యూరియా విషయంలో ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. 1హెక్టారు పత్తి పంటకు 150కిలోల నత్రజని అవసరం అనగా 6బస్తాల యూరియా పత్తి పంటకు సరిపోతుందన్నారు. రైతులు మోతాదుకు మించి యూరియాను వినియోగిస్తే రసం పీల్చే పురుగుల బెడద అధికమవుతుందన్నారు. దీని ప్రభావం పంట దిగుబడిపై పడుతుందన్నారు. అందుచేత సూచించిన మోతాదుకు మించి యూరియా వినియోగించవద్దని జెసి రైతులకు విజ్ఞప్తి చేశారు.

## కవచాలంకృత అలంకారంలో శ్రీవాసవీమాత అమ్మవారు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** ఆషాడ మాసం చివరిరోజును పురస్కరించుకొని గురువారం పట్టణంలోని స్థానిక అమ్మవారిశాల నందు శ్రీ వాసవీమాత అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు కవచాలంకృత అలంకారంలో శ్రీవాసవిమాత అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించారు



## ప్రమాదాలను ఎలా ఎదుర్కొవాలో

# విద్యార్థులకు అవగాహన సదస్సు



శక్తిటీం నోడల్ అధికారి అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు మాట్లాడుతున్న దృశ్యం




ప్రమాదాన్ని ఎలా ఎదుర్కొవాలో తెలియజేస్తున్న సిబ్బంది

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా ఆదేశాల మేరకు శక్తిటీం నోడల్ అధికారి అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు సూచనలతో నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ పీజీ కళాశాలలో శక్తిటీం బృందాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రమాదాలను ఎలా ఎదుర్కొవాలో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి మంద జావళి ఆల్ఫోన్స్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు మాట్లాడుతూ ఏదైనా అపాయం జరిగినప్పుడు మహిళలు ఈసమాజంలో తమకు తాము రక్షణ కల్పించుకోవడంతో పాటు విద్యలో మంచి తర్ఫీదులు నేర్చుకుని రేపటి సమాజానికి ఉపయోగపడాలని మొబైల్ ఒక వ్యసనం లాంటిది దానిని ఎక్కువగా ఉపయోగించడం వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ దానికి ఎంత దూరంగా ఉంటే అంత సురక్షితంగా ఉంటామని తెలిపారు. ఏఎస్పీ మంద జావలి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని సమాజంలో ప్రస్తుతం జరిగే నేరాలపై అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాం, ఏఎస్ఐ జయలక్ష్మి, సెల్ఫ్‌డిఫెన్స్‌లో అవగాహన కల్పించిన మహిళా కానిస్టేబుల్ సబీనా, కానిస్టేబుల్ ఇంతియాజ్‌లు పాల్గొన్నారు.

